క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



పెనుగంచిప్రోలు: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాచర్ల సుహాసిని అన్నారు. మంగళవారం ఆమె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ నిర్వహిస్తున్న సీడీఎన్‌సీడీ (కమ్యూనికల్, నాన్‌కమ్యూనికల్ వ్యాధులకు) సర్వేను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వంశపారంపర్యంగా వచ్చే బీపీ, షుగర్‌తో పాటు ఇతర వ్యాధులకు సంబంధించి సిబ్బంది సర్వేకు సహకరించాలన్నారు. వైద్యాధికారి సుజన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



కంచికచర్ల: మండలంలోని కీసర బీజేటీ స్కూల్‌లో జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్లాజా సీఓఎం రాజారావు మాట్లాడుతూ రోడ్డుపై వెళ్లే సమయంలో రోడ్డు భద్రతా నియమ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సేఫ్టీ అధికారి శ్రీనివాస్, సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, స్కూల్ హెచ్ఎం సిస్టర్ జాన్సీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

నందిగామ టౌన్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం తొమ్మిది, 10 తరగతుల విద్యార్థులకు బేటీ పడావో.. బేటీ బచావో, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో భాగ్యరేణుక, ఏసీడీపీవో కృష్ణకుమారి, సూపర్‌వైజర్ తారాబీ, తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరలతో ఆరోగ్యం



మక్కపేట(వత్సవాయి): పురుగుమందులు పిచికారీ చేయని ఆకు కూరలు, కూరగాయలు ఆరోగ్యకరమని ఏసీడీపీవో నాగమణి తెలిపారు. మంగళవారం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో సాగవుతున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పురుగుమందులు పిచికారీ చేయని ఆకు కూరలు, కూరగాయలతో పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ నివాసప్రాంత్రాలలో వీలైనంతవరకు ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న గర్భిణులు, బాలింతలకు కిచెన్‌గార్డెన్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక ఫలసాయం



కంచికచర్ల: సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక ఫలసాయం పొందవచ్చని నందిగామ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఐకే శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మొక్కజొన్న పంటను పరిశీలించారు. కత్తెర పురుగును గమనించినట్టు తెలిపారు దీనిని కూలీల సహాయంతో తొలగించి నాశనం చేయాలన్నారు. పంట 30–40 రోజుల వయసులో గుళికలు వేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించటమే ధ్యేయంగా రైతులను ముందుకు నడిపించటమే పొలం పిలుస్తోంది కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కే విజయ కుమార్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు అనిల్, రైతులు పాల్గొన్నారు.

వినూత్నం.. పొట్టేళ్ల పెంపకం

- పొట్టేళ్ల పెంపకానికి ఎలివేషన్ షెడ్స్
- పెనుగంచిప్రోలులో కొత్తగా ఎలివేషన్ షెడ్ నిర్మాణం
- షెడ్ వద్దే గడ్డి, దాణా పెంపకం



పొట్టేళ్ల పెంపకానికి రైతు ఏర్పాటు చేసుకున్న ఎలివేషన్ షెడ్

పెనుగంచిప్రోలు: వ్యవసాయ అనుబంధ పరిశ్రమలలో రైతులు వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కోళ్లు, పశువుల పెంపకానికి ఏర్పాటు చేస్తున్న షెడ్స్ తరహాలో గొర్రెలు, పొట్టేళ్ల పెంపకానికి ఎలివేషన్ షెడ్స్ ఏర్పాటే ఇందుకు ఉదాహరణ. పెనుగంచిప్రోలు గ్రామానికి చెంది రైతు దేవరశెట్టి రాంబాబు ఈప్రాంతంలో మొదటగా మునేరు అవతల తన పొలంలో సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేసి షెడ్ ఏర్పాటు చేసి కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టాడు.

షెడ్ నిర్మాణం ఇలా..

షెడ్ నిర్మాణం రెండు అరలుగా ఉంటుంది. మొదటి అరలో పొట్టేళ్లు ఉంటాయి. దాని కింద రెండో అర ఉంటుంది. అవి వేసిన విసర్జితాలు, ఇతర వ్యర్థాలు కింద అరలోకి పడుతుంది. దానిని ఎరువుగా వినియోగిస్తారు. ట్రాక్టర్ ట్రక్కు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. షెడ్‌ను నెట్‌తో క్లోజ్ చేస్తారు. గాలి వెలుతురు సక్రమంగా జీవాలకు అందుతుంది.

100 పిల్లలతో ఏర్పాటు..

షెడ్‌లో మొదటగా 3 నుంచి 4 నెలల వయస్సున్న పొట్టేళ్ల పెంపకం చేపట్టాడు. వీటిలో సగం నాటువి కాగా సగం నెల్లూరు నుంచి హైబ్రిడ్ జుడిపి రకం తీసుకు వచ్చాడు. నాటు పొట్టేళ్లు 3 నెలల్లో 30 నుంచి 35 కిలోలు వస్తాయని, నెల్లూరు పొట్టేళ్లు 5, 6 నెలల్లో 70 కిలోల నుంచి క్వింటా వరకు బరువు వస్తాయన్నారు. ప్రస్తుతం కిలో రూ.450 చొప్పున పొట్టేళ్లు విక్రయిస్తున్నామన్నారు. నెలకు ఖర్చులు పోను రూ.30 వేలు ఆదాయం వస్తోందన్నారు.



షెడ్ పక్కన పెంచుతున్న స్వీట్ పొటాటో



షెడ్‌లో పెరుగుతున్న పొట్టేళ్లు

దాణా స్వయంగా పెంచుతూ..

వీటికి అవసరమైన దాణా కూడా షెడ్ పక్కనే ఎటువంటి రసాయనాలు వాడకుండా పెంచుతున్నారు. ప్రస్తుతం పొట్టేళ్ల దాణా కోసం స్వీట్ పొటాటో, దశరథ గడ్డి, 4జి నేపియర్ వంటి గడ్డి రకాలు పెంచుతున్నామన్నారు.

షెడ్లలో పెంచితే ఆరోగ్యం..



మందలో కలవకుండా షెడ్లలో పెంచటం వలన పొట్టేళ్లు ఎంతో ఆరోగ్యంగా ఉంటాయి. దాదాపు రోగాలు రాకుండా ఉంటాయి. అన్నింటికీ అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉండదు.

– రాంబాబు, రైతు

నిరుద్యోగులకు మేలు

ఎలివేషన్ షెడ్ల నిర్మాణానికి జాతీయ లైవ్ స్టాక్ మిషన్ రాయితీ అందజేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవచ్చు. గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే గరిష్టంగా ఈ పథకం ద్వారా రూ.కోటి వరకు బ్యాంక్ రుణం పొందే అవకాశం ఉంది. రూ.కోటి పొంది యూనిట్ ఏర్పాటు చేస్తే రూ.50 లక్షల వరకు సబ్సిడీ లభిస్తుంది.

– పి.అనిల్, పశువైద్యాధికారి

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

వత్సవాయి: గ్రామాలల్లోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం వత్సవాయి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో నేర ప్రవృత్తి ఎక్కువవుతుందన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. నేరాలను అరికట్టే పనిలో భాగంగా సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇటీవలకాలంలో గ్రామీణ ప్రాంతాలలో దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా కూడా తమ నివాసాలకు కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పగటి సమయంతో పలు రకాల వస్తువులు అమ్ముకునేవారిలా నటిస్తూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఇంట్లో ఒక్కరే ఉంటే ఎట్టి పరిస్థితులోనూ కొత్త వ్యక్తులను ఇంటిలోకి రాకుండా చూసుకోవాలన్నారు. ఎవరన్నా తలుపుకొట్టినా కిటికీలోనుంచి చూసి వారు తెలిసిన వారు అయితేనే గుర్తించి అప్పుడు తలుపులు తీయాలని చెప్పారు. గ్రామాలలో సురక్ష కమిటీలను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా గ్రామాలలో జరిగే చిన్నపాటి తగాదాలను స్టేషన్ వరకు రాకుండా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు వినతి



జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు

జగ్గయ్యపేట అర్బన్: తెగుళ్ల బారిన పడి తీవ్రంగా నష్టపోయిన మిర్చి పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం పార్టీ నాయకులు, రైతులతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశను కలిసి వినతిపత్రం అందజేశారు. మిర్చి రైతులు పడుతున్న సమస్యలను గురించి వివరించారు. మిర్చికి కనీస గిట్టుబాటు ధర క్వింటాకు రూ.20 వేలు, వైరస్ వలన ఎండిపోయిన మిర్చి పంటకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం (క్రాప్ ఇన్సూరెన్స్) ప్రభుత్వం ద్వారా అందజేయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో అత్యధికంగా 10 వేల ఎకరాలకు పైగా మిర్చిపంటను రైతులు సాగుచేస్తున్నారని తెలిపారు. ఏటా మిర్చి పెట్టుబడి అనూహ్యంగా పెరిగిపోవడం వలన, ఈ సంవత్సరం రకరకాల కారణాల వలన దిగుబడి తగ్గడంతో రూ.10 నుంచి 12 వేల లోపు ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ ఏడాది తాలు కూడా ఎక్కువ వచ్చింది. ఎకరానికి కనీసం పెట్టుబడి రూ.2 లక్షలు అవుతున్నందున దిగుబడి 15 నుంచి 20 క్వింటాళ్లు రావడంతో రైతుకు ఎకరానికి రూ.లక్ష నష్టం వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో క్వింటా రూ.20 వేలు కల్పించి ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, యూత్ నేత గొట్టిపాళ్ల సురేష్ పాల్గొన్నారు.

నేడు కానుకల లెక్కింపు

వత్సవాయి: గ్రామంలో వేంచేసియున్న శ్రీరామ జగపతి దేవసమేత శ్రీ వత్సవాయమ్మ తల్లి ఆలయ హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్టు ఈవో సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరెలు, జాకెట్ ముక్కలకు వేలం జరుగుతుంది. ఆసక్తి కలిగినవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

టీబీ వ్యాధి నిర్మూలనపై అవగాహన



బూదవాడ(జగ్గయ్యపేట): టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రామ్‌కో కర్మాగారం వైద్యుడు రాజా కేశవ ప్రసాద్ పేర్కొన్నారు. గ్రామంలో రామ్‌కో సిమెంట్స్ ఆధ్వర్యంలో మంగళవారం టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి ఉన్నవారు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాధి సోకిన వారిని చిన్నచూపు చూడకూడదని తెలిపారు. అనంతరం ముక్త భారత సాకార ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మైన్స్ జీఎం జాన్‌రెడ్డి, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలని ఆందోళన



జగ్గయ్యపేట అర్బన్: వేరుకుళ్లు తెగులు వలన నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతు సంఘం డివిజన్ నాయకులు కాకనబోయిన లింగారావు మాట్లాడుతూ మండలంలోని రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట,తక్కెళ్లపాడు, బూదవాడ తదితర గ్రామాల్లో మిర్చిపంటకు వేరుకుళ్లు తెగులు సోకి పంట ఎండిపోయిందన్నారు. దీంతో రైతులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి ఎకరానికి రూ.లక్ష నష్టపరిహారం అందించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, జస్టిస్ సోమనాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి, ఎమ్మెల్యే తాతయ్య, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, హార్టీ కల్చర్ అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. నాయకులు ఎస్.నాగమణి, కోట కృష్ణ, దంతాల నరేంద్ర, రావెళ్ల శేషు, రాంప్రసాద్, గోస్‌మియా, కె.వెంకటేశ్వరరావు, కోట రవికుమార్, రామచంద్రునిపేట సర్పంచ్ మద్దుల రామకృష్ణ, రైతులు పుట్టం అనంతరాములు, రాయల నరసింహారావు, అప్పారావు, యాకోబు, వినోద్, సుక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేదు

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు విమర్శ



అక్రమ ఇసుకరవాణాను అడ్డుకున్న తరువాత మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

ఇందుగపల్లి(వత్సవాయి): కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ ఇసుకరవాణాకు అడ్డే లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆరోపించారు. సోమవారం అర్ధరాత్రి ఇందుగపల్లి రేవులో అక్రమ ఇసుకరవాణా జరుగుతుందన్న సమాచారం తెలుసుకున్న తన్నీరు రేవులోకి వెళ్లారు. అప్పటికే రేవులో పొక్లయిన్ (210 మిషన్)తో టిప్పర్లతో ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. అప్పటికే 20 టిప్పర్లు ఇసుక లోడ్‌తో వెళ్లిపోయాయని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కనుసన్నల్లోనే అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణా గురించి రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలకు చెప్పినా పట్టించుకునే దిక్కేలేదన్నారు. ఇందుగపల్లి, ఆళ్లూరుపాడు రేవుల నుంచి తెలంగాణ సరిహద్దు కేవలం పదికిలోమీటర్లు మాత్రమే ఉండడంతో యథేచ్ఛగా అక్రమ ఇసుక తెలంగాణాకు తరలివెళ్తుందన్నారు. అక్రమ ఇసుకరవాణాతో కోట్లాది రూపాలయల ప్రభుత్వధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి అక్రమరవాణాను అరికట్టకపోతే ప్రజలే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి రవాణాను అడ్డుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు వాసిరెడ్డి కృష్ణారావు, కిలారు హనుమయ్య, రాయల సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, చావా రాజా, మండవ శ్రీనివాస్‌గౌడ్, మాతంగి నాగబాబు, ముల్లయ్య పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విన్నర్స్‌తో జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్ఎం మాధవీలత, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జేవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్లే ఫిట్ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు స్కూల్ హెచ్ఎం. ఎ.మాధవీలత తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 26 టీములు పాల్గొనగా, జేవీజే జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు విన్నర్స్‌గా నిలవడం అభినందనీయమన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అమ్మవారి పెద్ద తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు



పాలకవర్గ సమావేశంలో ఆలయ ఈవో కిషోర్ కుమార్, చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆలయ చాంబర్‌లో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించి చర్చించటంతో పాటు తీర్మానలు ఆమోదించారు.

ఫిబ్రవరిలో నిర్వహించే అమ్మవారి పెద్ద తిరునాళ్లకు సంబంధించి రూ.1,19,55,000లతో చేపట్టు పనులకు ఆమోదం తెలిపారు. ఆలయం వద్ద వివిధ రకాల వ్యాపారాలు, ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల దుకాణాలు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసిన బహిరంగ వేలం పాటలను పరిశీలించి పాలకవర్గం వారు ఆమోదం తెలియజేశారన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ ఎల్.రమ, ఏఈ రాజు, ఏఈవో ఉపమాపతి, తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన ర్యాలీలు



జగ్గయ్యపేటలో ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య, అధికారులు, సిబ్బంది



చిల్లకల్లు అవగాహన ర్యాలీలో రాము, తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి అవసరాల కోసం సోలార్‌ను ఏర్పాటు చేసుకొని ఖర్చును ఆదాచేసుకోవచ్చునని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో మంగళవారం ప్రధాన మంత్రి సూర్యఘర్‌పై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు మెగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సోలార్ సిస్టంకు సంబంధించిన ఉపయోగాలను పట్టణ ప్రజలకు తెలియజేసి తద్వారా రిజిస్ట్రేషన్‌లను పెంచాల్సిందిగా కోరారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు నమోదుచేయడానికి కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, తహసీల్దార్ మనోహర్, కౌన్సిలర్ కె.రామలక్ష్మి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనా పథకంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని డ్వామా పీడీ రాము పేర్కొన్నారు. గ్రామంలో సూర్యఘర్ పథకంపై మంగళవారం అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవటం వల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. గ్రామాలలోని సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్‌తో ఉత్పత్తి చేసిన విద్యుత్‌లో వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను విక్రయించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు, ఎంపీడీవో నితిన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, కార్యదర్శి శివాజీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్: ప్రతి ఇల్లు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనా పథకం వెలుగులతో నిండాలని జిల్లా ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో మంగళవారం పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పథకం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని తెలిపారు. విద్యుత్ చార్జీలు తక్కువగా వస్తాయని, మిగులు విద్యుత్‌ను విక్రయించుకుని ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, సీడీపీవో భాగ్యరేణుక, ఏసీడీపీవో కృష్ణకుమారి, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన



పేట తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



నందిగామ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామ టౌన్: న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించటం బాధాకరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రుబాబు విద్యాసాగర్ పేర్కొన్నారు. న్యాయవాది బెజవాడ బిక్షయ్యపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేయటాన్ని నిరసిస్తూ విజయవాడ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం కూడా న్యాయవాదులు విధులు బహిష్కరించి న్యాయస్థాన సముదాయ ప్రాంగణంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై అక్రమ కేసులు మోపుతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొమ్మినేని మాలేశ్వరరావు, లక్ష్మీకాంత్, విశ్వేశ్వరరావు, రామచంద్రారెడ్డి, కస్తాల నూతన్, బెజవాడ గోపి, సురేష్, అప్పాజి, లక్ష్మీనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాది బెజవాడ బిక్షమయ్యపై పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ర్యాలీగా తరలివెళ్లి జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాధికకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అన్నెపాగ సుందరరావు, బద్దుల వెంకట్రామయ్య, యర్రమాజు ధనుంజయుడు, రాయపూడి శ్రీనివాసరావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, పూలనాగరాజు, దాసరి నాగేశ్వరరావు, కె.ప్రతాప్‌రెడ్డి, కరిసె రత్నబాబు, జగ్జీవన్‌రావు, శ్రీధర్, అశోక్, శేషకుమారి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.